సాక్షి
మంచిర్యాల
గురువారం । 26 । సెప్టెంబర్ । 2024

జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మేజిక్ బుక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని డ్వాక్రా భవనంలో జాబ్‌మేళా నిర్వహించారు. నిరుద్యోగులు ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో ఎస్.కిషన్ అన్నారు. 386 మంది నిరుద్యోగులు హాజరు కాగా ప్రైవేటు సంస్థల్లో 86 మందికి ఆఫర్ లెటర్స్ అందజేశారు. డీపీఎంలు స్వర్ణలత, వేణు, జేడీఎం రాంచందర్, మేజిక్ బస్ ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ అధికారి తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు సదావకాశం

మంచిర్యాలఅర్బన్: దేశ సేవలో పాలుపంచుకోవాలనుకునే ఇంటర్మీడియట్ విద్యార్థులకు సదావకాశమని ఇండియన్ ఎయిర్స్ ఫోర్స్ విభాగం నాన్ కమిషన్ ఆఫీసర్ సందీప్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అగ్నివీర్, అగ్నిపథ్, ఎయిర్ ఫోర్స్‌పై అవగాహన కల్పించారు. డీఐఈవో అంజయ్య, అధ్యాపకులు రజిత, సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ విభాగం కన్వీనర్ స్వామి పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0 /25.0

చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఆగ్నేయం దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

అవార్డు అందుకున్న ఎస్‌హెచ్‌ఓ



అవార్డు అందుకుంటున్న దేవయ్య

బెల్లంపల్లి: పౌరులకు సత్వర సేవలు, బాధితుల సమస్యల పరిష్కారానికి మేలైన చర్యలు తీసుకుని పోలీసు శాఖలో బెస్ట్ సిటిజన్ సర్వీసెస్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మూడోస్థానంలో నిలిచిన బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య అవార్డు అందుకున్నారు. బుధవారం హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డీజీపీ జితేందర్ అవార్డు అందజేశారు. పోలీసు సేవలపై రాష్ట్రస్థాయిలో పోలీసుశాఖ సర్వే నిర్వహించగా బెస్ట్ సిటిజన్ సర్వీసెస్ విభాగంలో బెల్లంపల్లి వన్‌టౌన్ మూడో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఉత్తమ సేవలు అందించిన పోలీసు ఠాణాలకు అవార్డులు అందజేసి డీజీపీ ప్రశంసించారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ మహేష్ మురళీధర్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన కుమ్మరికుంట సర్వే

చెన్నూర్: చెన్నూర్ కుమ్మరికుంట చెరువు సర్వే బుధవారమూ కొనసాగింది. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు నిర్వహించిన సర్వేలో హద్దులను గుర్తించిన అధికారులు పాయింట్స్ నిర్వహించలేదు. గురువారం మరోమారు సర్వే చేయనున్నట్లు తెలిసింది. హద్దుల పాయింట్ ఏర్పాటు చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పించే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంటున్నారు. చెరువు హద్దుల పాయింట్‌లు ఏర్పాటు వరకు సర్వే విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. సర్వే ఫలితాల వెల్లడికి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం హద్దులను నిర్ణయించి సర్వే పూర్తి చేసే అవకాశం కనిపిస్తోంది. సర్వే పూర్తయితే ఎంత మేరకు ఆక్రమణకు గురైందనే విషయం వెలుగులోకి రానుంది. శిఖంలో నివాస గృహాలు ఉన్నాయా, ఉంటే కూల్చేస్తారా..? వదిలేస్తారా..? అనే రోజుల్లో తేలనుంది.

కేజీబీవీలో పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ కేంద్రంలో బుధవారం కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. జిల్లాలో స్పెషల్ ఆఫీసర్లు-2, సీఆర్‌టీలు-9, పీజీసీఆర్‌టీలు 7 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. 18 పోస్టులకు గాను 46 మంది పిలువగా.. 37 మంది హాజరు కాగా 9 మంది గైర్హాజరయ్యారు. 2023 జులైలో నిర్వహించిన పరీక్షలో మిగిలిన అభ్యర్థులను మెరిట్, రోస్టర్ ప్రకారం ఖాళీల భర్తీకి 1:3 పద్ధతిన ఎంపిక చేసి సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఇందులో 1:1 ప్రాతిపదికన ఎంపిక చేసి జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తర్వాత పాఠశాల కేటాయింపునకు కౌన్సెలింగ్ నిర్వహించి ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కరపత్రాలు విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న అనిత

మంచిర్యాలటౌన్: దిశా కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక లేబర్ అడ్డాలో ఎయిడ్స్,హెచ్ఐవీపై అవగాహన కరపత్రాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత విడుదల చేశారు. అనంతరం జన జాగృతి కళాజాత బృందం కళాజాత నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిత మాట్లాడుతూ ఈ నెల 29వరకు ప్రతీరోజు మంచిర్యాల, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూరు డివిజన్లలో కళాజాత బృందం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఉప వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివప్రతాప్, డెమో వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ దీక్షిత, దిశా అధికారి నీలిమ, రాజేశ్, సంతోష్, స్నేహ పాల్గొన్నారు.

మిల్లర్లకు డెడ్‌లైన్!



సీఎంఆర్ అందించే మిల్లును తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్)

- సీఎంఆర్' అప్పగించకపోతే కఠిన చర్యలు
- తాజాగా ఈ నెల 30వరకు గడువు విధింపు
- బియ్యం ఇవ్వకపోవడంతో సర్కారుకు నష్టం
- ఈసారైనా గడువులోపు అందిస్తారా?

ధాన్యం, బియ్యం వివరాలు టన్నుల్లో

సంవత్సరం	సీజన్	కేటాయించిన ధాన్యం	ఇవ్వాల్సిన బియ్యం	మిగిలింది
2022–23	ఖరీఫ్	40470.78	7308.583	2217.552
2022–23	రబీ	92169	26449	6716
2023–24	ఖరీఫ్	139664	94057	39473
2023–24	రబీ	85266.520	57748	33968

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీఎంఆర్(కస్టం మిల్డ్ రైస్) అందించని మిల్లులకు సర్కారు డెడ్‌లైన్ విధించింది. ఆయా సీజన్లలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కేటాయించిన మిల్లులు సకాలంలో బియ్యం అందించాలని మిల్లర్లకు ఆదేశాలు ఇస్తున్నా పట్టించుకోకపోవడంతో కఠిన చర్యలకు సిద్ధమైంది. ఈ నెల 30లోపు బియ్యం అప్పగించాలని తాజా గడువు విధించారు. గత వానాకాలం సీజన్‌కు సంబధించి కచ్చితంగా మిల్లర్ల నుంచి బియ్యం తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు ఉన్నాయి. చాలామంది మిల్లర్లు పలు కారణాలు చెబుతూ దాటవేస్తున్నారు. గత యాసంగికి సీజన్‌కు గడువు ఇచ్చే అవకాశం ఉండొచ్చు. గత వానాకాలం సీజన్ మాత్రం ఎట్టిపరిస్థితిల్లోనూ ఉపేక్షించేది లేదని అధికారులు అంటున్నారు. ఈ క్రమంలో బకాయిలున్న మిల్లర్లపై చర్యలు ఉండే అవకాశం ఉంది. గడువులోపు బియ్యం అందిస్తారా? అనేది సందేహంగా మారింది.

ఏటేటా ఇదే తీరు

ప్రతీ సీజన్‌లో ప్రభుత్వమే రైతుల నుంచి మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం సేకరణ జరుగుతోంది. ఈ ధాన్యాన్ని జిల్లాలో ఉన్న మిల్లులకు కేటాయిస్తే, మిల్లర్లు కస్టం మిల్డ్ రైస్(సీఎంఆర్)గా అందించాలి. ఇందుకు కేంద్ర ప్రభుత్వ ఎఫ్‌సీఐకి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు అప్పగిస్తే అవే బియ్యం రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు అందిస్తున్నారు. అయితే మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జైపూర్‌లో ఓ మిల్లుపై క్రిమినల్ కేసు సైతం నమోదు చేశారు. బకాయిలు ఉన్న మిల్లర్లపై చర్యలు తీసుకుంటున్నారు. 2021–22 యాసంగి ధాన్యం సంబంధించిన సీఎంఆర్ ఇవ్వకుండా అలసత్వం చేసిన 19మిల్లులకు రూ.51కోట్ల జరిమానా విధించారు. మళ్లీ 2022–23 ఖరీఫ్ సీజన్‌కు చెందిన సీఎంఆర్ సకాలంలో అప్పగించని 20మిల్లులపై ఇప్పటికే నోటీసులు ఇచ్చారు. రబీ(యాసంగి) సీజన్(2023–24)సంబంధించి కలిపి 41శాతమే బియ్యం అప్పగించారు. జరిమానా, వీడ్డీ, ఎకానమిక్ కాస్టు, తదితర వాటితో కలిపి చెల్లించాలంటూ మిల్లులకు ఆదేశాలు ఇచ్చారు. చాలా మంది మిల్ల ర్లు ఇప్పటికీ చెల్లించడం లేదు. తాజాగా గత వానాకాలం, యాసంగి కూడా పెండింగ్‌లో ఉండడంతో ప్రస్తుతం గడువు విధించారు. అయితే రా రైస్ మిల్లర్లు తమకు నష్టం వస్తోందని సీఎంఆర్ బకాయిలు ఇవ్వడంలో వెనుకబడుతున్నారు. బాయిల్డ్ మిల్లులు మాత్రం చాలా వరకు సీఎంఆర్ అప్పగిస్తున్నారు.

ధాన్యం లెక్కల్లో గోల్‌మాల్

జిల్లాలో ప్రతీ సీజన్‌లోనూ ధాన్యం దిగుబడి పెరుగుతూ వస్తోంది. రైతులకు కొనుగోళ్ల సమయంలో జాప్యం లేకుండా ఉండేందుకు మిల్లులకు ధాన్యం అప్పగించడంతో నిల్వ చేసే సామర్థ్యం లేకుండా బస్తాలు దించుకుంటున్నారు. అయితే తర్వాత వానాకాలంలో వానలకు తడిసిపోతున్న ఘటనలు ఉన్నాయి. గతంలో ఎఫ్‌సీఐ అధికారులు పరిశీలనకు వస్తే లెక్కలు చూపించకుండా తప్పించుకున్నవారు ఉన్నారు. అంతేకాక ధాన్యం పక్కదారి పట్టించి బియ్యం కొనుగోలు చేసి మళ్లీ పౌరసరఫరాల శాఖకు ఇస్తున్నారు. ఇక కొందరు రేషన్ బియ్యాన్నే కొనుగోలు చేస్తూ, సీఎంఆర్‌లో కలిపేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో కొన్ని మిల్లుల్లో రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఒక్కొక్కరికి రెండేసి చొప్పున మిల్లులు ఉంటూ గత కొన్నేళ్లు ప్రభుత్వం ఇచ్చే ధాన్యంతో కోట్లకు పడగలెత్తుతున్నారు. వీటన్నింటిపైనా విచారణ జరపాలని ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినా ఆచరణ సాధ్యం కాలేదు.

బకాయిలుంటే ధాన్యం కేటాయించం



సీఎంఆర్ బకాయిలు ఉన్న మిల్లర్లకు ఎప్పటికప్పుడు సీఎంఆర్ అందించాలని ఆదేశాలు ఇస్తున్నాం. గత ఏడాది బకాయిలు ఉన్న మిల్లర్లపై నిబంధనల మేరకు జరిమానాలు విధించి చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. గడువులోపు బియ్యం ఇవ్వని మిల్లర్లకు ఈ సీజన్ నుంచే కేటాయింపులు నిలిపివేస్తాం.

– సబావత్ మోతీలాల్,
అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)

రియల్ వ్యాపారం కుదేల్

- ప్లాట్ల కొనుగోలుకు ముందుకురాని ప్రజలు
- లేఔట్ అనుమతి లేని వెంచర్లపై విముఖత
- చెరువు, ప్రభుత్వ భూముల సమీపంలో నిలిచిన కొనుగోళ్లు
- వరద ముప్పు ప్రాంతాల్లోనూ అంతే..



మంచిర్యాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు, ఆదాయం

నెల	రిజిస్ట్రేషన్లు	వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)
జూన్	1,500	46
జూలై	1,394	43
ఆగస్టు	1,288	42
సెప్టెంబర్	900	32

మంచిర్యాలటౌన్: జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలవుతోంది. కొన్ని నెలలుగా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టడంతో ఆ మేరకు ఆదాయం పడిపోతోంది. మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి నెలకు రూ.కోటి నుంచి రూ.2కోట్ల ఆదాయం సమకూరగా.. గత మూడు నెలలుగా అందులో సగం కూడా రావడం లేదు. భూమి ధరలు సామాన్యుడికి అందుబాటులో లేనంతగా పెంచడం ఒక కారణం కాగా, వరదలు వచ్చే ప్రాంతాలు, చెరువు శిఖం భూములు, ప్రభుత్వ భూముల్లోని ప్లాట్లను ఎక్కడ అమ్ముతున్నారోననే భయంతో ప్రజలు కొనేందుకు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుండడం మరో కారణంగా తెలుస్తోంది. హైదరాబాద్‌లో హైడ్రా అక్రమ కట్టడాలను కూల్చి వేస్తుండడం, చెరువు శిఖం భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటుండడం, జిల్లాల్లోనూ ఇదే తరహా చర్యలను ప్రభుత్వం చేపడుతుందనే అభిప్రాయంతో ప్లాట్ల కొనుగోలుకు వెనుకడుగు వేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం లేఔట్ అనుమతి లేని ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేయకుండా నిలిపివేయడంతో అక్రమంగా వెలిసిన వెంచర్లలోని ప్లాట్ల అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయాయి. సబ్ రిజిస్ట్రార్లను మచ్చిక చేసుకుని రెండు నెలల క్రితం వరకు అనుమతి లేని లేఔట్ల ప్లాట్లను విక్రయించిన రియల్ వ్యాపారులు, ప్రస్తుతం వాటిని కొనుగోలు చేసిన వారు అమ్ముకునేందుకు అవకాశం లేకుండా పోవడంతో, రియల్ వ్యాపారులు ఆయా ప్లాట్లను తిరిగి తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. ప్లాట్లు, ఇళ్ల కొనుగోళ్లు, అమ్మకాలు తగ్గిపోవడంతో రిజిస్ట్రేషన్లు తగ్గిపోయి, ప్రభుత్వానికి ఆదాయం కూడా రావడం లేదు.

రిజిస్ట్రేషన్లు తగ్గాయి

మంచిర్యాలలో ఇటీవల రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయి. అనుమతి లేని లేఔట్లలోని ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడం లేదు. విరాసత్‌కు సంబంధించినవి, గతంలో అగ్రిమెంటు చేసుకున్నవి, మార్టిగేజ్ చేసుకునేవి ఎక్కువగా అవుతున్నాయి. మూడు నెలల నుంచి రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గి ఆదాయం పడిపోయింది. కట్టిన ఇళ్లు, అపార్టుమెంట్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ఎక్కువగా అవుతుండగా, ఖాళీ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు తక్కువగా అవుతున్నాయి.

– శ్రీనివాస్‌రెడ్డి, ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్

తగ్గుతున్న ఆదాయం

చెరువు బఫర్‌జోన్, ప్రభుత్వ భూముల్లో ప్లాట్ల కొనుగోలు, ఇళ్ల నిర్మిస్తే ప్రభుత్వం కూల్చేస్తుందనే భయం ప్రజల్లో నెలకొంది. ఇటీవల నస్పూరులో ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఐదంతస్తుల భవనాన్ని అధికారులు కూల్చేయడం జిల్లాలోనే చర్చనీయాంశంగా మారింది. గతంలో కొనుగోలు చేసిన భూములు ప్రభుత్వానికి చెందినవా, చెరువు బఫర్ జోన్‌లో ఉన్నాయా అని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో 1,500 రిజిస్ట్రేషన్లతో రూ.46 లక్షలు ఆదాయం సమకూరగా.. సెప్టెంబర్‌లో 900 రిజిస్ట్రేషన్లకు పరిమితమై ఆదాయం రూ.32 లక్షలకు పడిపోయింది. మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రాష్ట్రంలోనే అత్యధికంగా ఆదాయం అందించే కార్యాలయాల్లో రెండోస్థానంలో నిలిచిన ఘనత ఉంది. రోజుకు 70 నుంచి 80కి పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు అవుతుండగా, నెలకు రూ.4 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ప్రస్తుతం నెలకు రూ.50 లక్షలకు తక్కువగా ఆదాయం వస్తుండడంతో రియల్ వ్యాపారం ఎంత మందగించిందో అర్థమవుతోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 20,038 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయగా, రూ.57.08 కోట్లు, 2023–24లో 20,173 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయగా, రూ.53.01 కోట్ల ఆదాయం వచ్చింది. ఇటీవల ప్రభుత్వం అక్రమ రిజిస్ట్రేషన్లు, అనుమతి లేని వెంచర్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేయకుండా చర్యలు తీసుకోవడంతో సబ్ రిజిస్ట్రార్లు వాటి రిజిస్ట్రేషన్‌కు వెనుకాడుతున్నారు. దీంతోనే రిజిస్ట్రేషన్లు తగ్గగా.. హైడ్రా తరహా జిల్లాలో కూడా వస్తుందనే భయం కూడా దీనికి తోడైంది.

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్‌ఎస్



కూరగాయల మార్కెట్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్ కుమార్

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ
- కూరగాయల మార్కెట్ ప్రారంభం

బెల్లంపల్లి: పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల్లో ముంచేసి ప్రజల బతుకులు ఆగం చేసిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ విమర్శించారు. బుధవారం రూ.7.58 కోట్లతో బెల్లంపల్లిలో నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ బెల్లంపల్లి అభివృద్ధికి నిధులు కేటాయించడానికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. బెల్లంపల్లి పట్టణ ప్రజలకు గోదావరి జలాల సరఫరాకు తాగునీటి పథకం మంజూరు చేయించానని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ బెల్లంపల్లికి గోదావరి జలాలు అందించడానికి సర్వే పనులు జరుగుతున్నాయని తెలిపారు.

పీటీఆర్ ప్రారంభోత్సవం

బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రూ.98 కోట్లతో ఏర్పాటు చేసిన 5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పీటీఆర్‌ను ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, డీఈ బి.రాజన్న, ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జే.శ్వేత, వైస్‌చైర్మన్ బి.సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ కే.శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, కాంగ్రెస్ నాయకులు సీహెచ్.శంకర్, ఎం.మల్లయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కూరగాయల కొనుగోలు

ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్ మార్కెట్ ప్రారంభించిన అనంతరం కూరగాయలు కొనుగోలు చేశారు. ఓ స్టాల్ వద్దకు వెళ్లి కూరగాయలు బేరమాడారు. కలుపుగోలుగా మాట్లాడుతూ టమాటాలు, బెండకాయలు కొన్నారు.

‘విద్యతో ఏదైనా సాధ్యమే’



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి రవి

చెన్నూర్: ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే విద్యతోనే సాధ్యమని చెన్నూర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే భారత న్యాయస్థానం, చట్టాలపై అవగాహన ఉండాలని పేర్కొన్నారు. మహిళల చట్టాలు, బాలికల భద్రత, సైబర్ నేరాలు, సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై శ్వేత, పాఠశాల ప్రత్యేకాధికారి సుమలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌చందర్ గిల్డా, న్యాయవాదులు రాంభావు, రమేశ్, బార్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు ప్రారంభం

- నాలుగు అంశాల్లో ఎంపిక
- రామగుండం సీపీ శ్రీనివాసులు



సీపీ శ్రీనివాసులుకు సెల్యూట్ చేస్తున్న జాగిలం

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీసు కమిషనరేట్ ఆవరణలో బుధవారం మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీసులకు పోలీసు డ్యూటీ మీట్ పోటీలను పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల ద్వారా పోలీసు అధికారులు చట్టాల అమలు, అంతర్జాతీయ భద్రత, నేరాలను శాస్త్రీయంగా గుర్తించడం, దర్యాప్తు చేయడం, సామర్థ్యాలను మెరుగుపర్చుకునే అవకాశం ఉందన్నారు. నాలుగు అంశాల్లో ప్రతిభ కనబర్చిన వారిని అక్టోబర్ 4న నిర్వహించే కాళేశ్వరం జోన్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రాజు, ఎస్బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

28న జాతీయ లోక్‌అదాలత్

మంచిర్యాలక్రైం: ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని, లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి చర్యలు



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: వయోవృద్ధుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని, వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోషణ సంక్షేమ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇంచార్జి జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణితో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 30వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వంద శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాలను వంద శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, లయన్స్‌క్లబ్ ప్రతినిధి సత్యనారాయణతో కలిసి డీఆర్‌పీలు, లయన్స్‌క్లబ్ సభ్యులతో న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో లక్షా 400 మంది నిరక్షరాస్యులు ఉన్నారని తెలిపారు.

ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం దిశగా చర్యలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం దిశగా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఇన్‌చార్జి జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వరూపారాణితో కలిసి ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి



రాపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ కోట శివకృష్ణ అన్నారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయం, బెల్లంపల్లి కేవీకే, హాజీపూర్ మండల వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో హాజీపూర్ మండలం రాపల్లి, టీకానపల్లి గ్రామాల్లో రైతులకు పత్తి, వరి పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పిందె రాలటం, రసం పీల్చే పురుగులను గుర్తించామని, గులాబీ రంగు పురుగు, కాయకుళ్లు, తెగులు వంటి సమస్యలు ప్రబలే అవకాశం ఉందని, రైతులు ఐదు లీటర్ల నీటికి ఒక మిల్లీలీటర్ నీటికి ప్లానోఫిక్స్ కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపతి, నాగరాజు, మండల వ్యవసాయాధికారి కృష్ణ, ఏఈఓ ప్రసన్న పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన

లక్సెట్టిపేట: జెండా వెంకటాపూర్, ఇటిక్యాల గ్రామాల్లో పత్తి పంటను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు పరిశీలించారు. వ్యవసాయ సంచాలకులు సురేఖ, శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, శ్రీకాంత్, శ్రీనివాస్, గోవర్ధన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

భైంసాటౌన్: పట్టణంలోని భైల్‌బజార్ ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కుంట ఏరియాకు చెందిన మాదోల్ల గట్టు కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్స కోసం మంగళవారం ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని రూ.30వేల నగదు, 6 గ్రాముల బంగారు ఉంగరం, కమ్మలు చోరీకి గురైనట్లు వాపోయాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో తండ్రి, కొడుకులకు జైలు

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన తండ్రి, కొడుకులకు జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయ అధికారి డాల్లు సింగ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 25న మామడలో ఎస్సై వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం మత్తులో లక్ష్మణచాంద మండలానికి చెందిన గంగన్న, ప్రశాంత్ అనే ఇద్దరు తండ్రీకొడుకులు వేర్వేరుగా పోలీసులకు పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరు పర్చగా స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ జడ్జి అజీజ్ రహేమాన్ గంగన్నకు 14 రోజులు, ప్రశాంత్‌కు 7 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మతి స్థిమితం లేని వృద్ధురాలు మృతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శంకర్‌నాయక్‌తండా గ్రామానికి చెందిన మతి స్థిమితం లేని వృద్ధురాలు వాగులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌నాయక్‌తండా గ్రామానికి చెందిన వృద్ధురాలు లచ్చిబాయి(65) బుధవారం సమీప వాగులో ప్రమాదవశాత్తు పడింది. మృతదేహం నీటిపై తేలగా గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు మృతదేహాన్ని వాగు నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదిలాబాద్ విద్యార్థి.. నిర్మల్‌లో ప్రత్యక్షం

నిర్మల్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పాఠశాలకు వెళ్లిన విద్యార్థి నిర్మల్ జిల్లాకేంద్రంలో ప్రత్యక్షమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. నిర్మల్ పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కాలర్‌సస్ ఉర్దూ పాఠశాలలో చదువుకుంటున్న షేక్ ముదస్సీర్ అనే విద్యార్థి బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లాడు. కానీ మధ్యాహ్నం ముదస్సీర్ నిర్మల్‌లో బంధువులకు కనపడగా వారు వెంటనే ముదస్సీర్ తండ్రి ముజాహిద్‌కు విషయం తెలిపారు. దీంతో ముజాహిద్ డయల్ 100కు సమాచారం అందించి కుమారుడి ఆచూకీ గుర్తించాలని కోరాడు. స్పందించిన నిర్మల్ పోలీసులు గాలించగా బస్టాండ్ సమీపంలో ముదస్సీర్‌ను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వ్యూ సేఫ్ లైన్స్

- రోడ్డు దాటే వన్యప్రాణులను వాహనదారులు గుర్తించేలా చర్యలు
- ప్రమాదాల నివారణకు గుబురు పొదలు, మొక్కలు తొలగింపు
- సఫారీ వెళ్లే దారుల్లోనూ ఏర్పాటు


ఇందన్‌పల్లి రేంజ్‌లో వ్యూలైన్స్ కోసం గడ్డి తొలగిస్తున్న కూలీలు

జన్నారం: అడవిలోని దట్టమైన చెట్లు, గుబురు మొక్కలు, పెద్ద పొదల నుంచి అకస్మాత్తుగా వన్యప్రాణులు రోడ్డు మీదకు వస్తుంటాయి. ఆ సమయంలో అటు నుంచి వాహనాలు వెళ్తే.. అటు వాహనదారులకు, ఇటు వన్యప్రాణులకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో అతివేగంగా వచ్చే వాహనదారులు వన్యప్రాణులను గుర్తిస్తే అపాయం తప్పుతుందనే ఉద్దేశంతో అటవీ శాఖ అధికారులు అడవిలో వ్యూలైన్స్ ఏర్పాటు చేశారు. జన్నారం అటవీ డివిజన్‌లోని ప్రధాన రహదారితో పాటు అటవీ ప్రాంతంలో సఫారీ ప్రయాణించే దారుల్లో వ్యూలైన్స్ ఏర్పాటు చేశారు. గత సంవత్సరం జన్నారం అటవీ డివిజన్‌లో 126 కి.మీల మేర వ్యూలైన్స్ ఏర్పాటు చేయగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 116 కి.మీ దూరం వ్యూలైన్స్ ఏర్పాటు చేశామని అధికారులు పేర్కొంటున్నారు.

వన్యప్రాణులను గుర్తించేందుకు..

అడవిలో రోడ్డు దాటే వన్యప్రాణులను వాహనదారులు గుర్తించేందుకు వ్యూలైన్స్ ఉపయోగపడుతాయి. వానాకాలంలో అడవులు దట్టంగా పెరుగుతాయి. రోడ్ల వెంట చెట్ల పొదలు, గుబురు మొక్కలు దట్టంగా మారుతాయి. దీంతో వన్యప్రాణులు వేగంగా రోడ్డు దాటే సమయంలో అకస్మాత్తుగా రోడ్డు మీదకు వస్తుంటాయి. గుబురు పొదల నుంచి వచ్చే అడవి పందులు, చుక్కల దుప్పులు, ఎలుగుబంట్లు, నీలుగాయిలు వాహనదారులకు కన్పించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు జన్నారం అటవి డివిజన్‌లోని ఇందన్‌పల్లి, జన్నారం, తాళ్లపేట్ అటవి రేంజ్‌ల పరిధిలోని పలు ప్రాంతాలను ఎంచుకొని ఆయా ప్రాంతాల్లో వ్యూలైన్స్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రోడ్లకు ఎడమ, కుడి వైపుల గుబురు పొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా 10 మీటర్ల దూరం వరకు పొదలను తొలగించడంతో వాహనంపై వెళ్లే వారికి వన్యప్రాణులు బయటకు వచ్చే సమయంలో కన్పించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు. వన్యప్రాణి బయటకు వచ్చే సమయంలో వాహనం వేగం తగ్గించి వెళ్తే ప్రమాదం నుంచి బయట పడొచ్చని అధికారులు చెబుతున్నారు.

సఫారీ వెళ్లే ప్రాంతాల్లోనూ..

ప్రధాన రహదారిపైనే కాకుండా అడవిలోకి సఫారీ వెళ్లే దారుల్లోనూ వ్యూలైన్స్ ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు సఫారిలో వన్యప్రాణులను వీక్షించేందుకు వెళ్తున్నప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా వీటిని ఏర్పాటు చేశారు. ఇందన్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలోని మైసమ్మ కుంట వైపు, బర్తన్‌పేట్ బేస్‌క్యాంప్ వైపు, జన్నారం అటవి రేంజ్‌లోని గొండుగూడ బేస్‌క్యాంప్, బైసన్ కుంట, చింతగూడ ప్రాంతాలలో వ్యూలైన్స్ ఏర్పాటు చేశారు.

కూలీలకు ఉపాధి

వ్యూలైన్స్ ఏర్పాటుతో నిత్యం పదుల సంఖ్యలో కూలీలకు ఉపాధి లభిస్తుంది. మూడు రేంజ్‌లలో కలిపి సుమారు 300 మంది కూలీలు వ్యూలైన్స్ ఏర్పాటు ద్వారా ఉపాధి పొందుతున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఒక్కో కూలీకి రోజుకు కూలి రూ. 350పైగా చెల్లిస్తున్నట్ల చెబుతున్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం



అడవి ప్రాంతంలో ప్రయాణించే ప్రయాణికులకు, వాహనదారులకు, వన్యప్రాణులకు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఏటా వ్యూలైన్స్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రధాన రహదారితో పాటు అడవిలో పర్యాటక ప్రదేశాలకు వెళ్లే రోడ్ల వెంట సైతం వ్యూలైన్స్ ఏర్పాటు చేశాము. వ్యూ లైన్స్ ద్వారా అడవి నుంచి బయటకు వచ్చే వన్యప్రాణులు వాహనదారులకు కనిపిస్తాయి. దీంతో వన్యప్రాణులకు ప్రమాదాలు జరుగవు.

– హఫీజోద్దీన్, ఇందన్‌పల్లి రేంజ్ అధికారి

లోన్ పేరుతో మోసం

దహెగాం: సైబర్‌క్రైం మోసాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు, యువతకు అవగాహన కల్పిస్తున్నా ఇంకా కొందరు కేటుగాళ్ల చేతుల్లో మోసపోతున్నారు. లోన్ పేరుతో ఒకరు మోసపోయిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కందూరి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రహ్మన్‌చిచ్యాల గ్రామానికి చెందిన దేశ్‌ముకుల సంజీవ్ ఇటీవల యూట్యూబ్‌లో వీడియోలు చూస్తుండగా ధని ఫైనాన్స్ యాడ్ వచ్చింది. యాడ్‌పై క్లిక్ చేయగా లోన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో అతను రూ.8 లక్షల లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. రెండు రోజుల తరువాత సైబర్‌క్రైం నేరగాళ్లు సంజీవ్ సెల్‌కు కాల్ చేసి లోన్ మంజూరు కావాలంటే డాక్యుమెంట్ చార్జీల కింద రూ.6,550 ఫోన్‌పే చేయాలని సూచించడంతో డబ్బులు ఫోన్‌పే చేశాడు. అరగంట తరువాత మరో కాల్ చేసి లోన్ డబ్బులు పంపామని అకౌంట్ చెక్ చేసుకోవాలన్నారు. అకౌంట్ చెక్ చేసుకున్న సంజీవ్ డబ్బులు రాలేదని చెప్పడంతో మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ రూ.24,698 కడితే అకౌంట్‌లో డబ్బులు జమ చేస్తామని చెప్పడంతో ఆ డబ్బులు సైతం ఫోన్‌పే చేశాడు. అయినా అకౌంట్‌లో డబ్బులు జమ కాకపోవడంతో కాల్ చేసిన నంబర్‌కు తిరిగి ఫోన్ చేయగా ఎక్కువ డబ్బులు కావడంతో మరో ఇన్‌స్టాల్‌మెంట్ కట్టాలని చెప్పడంతో అనుమానం వచ్చి తనకు లోన్ వద్దని తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరాడు. మరో రూ.4 వేలు కడితే డబ్బులు మొత్తం తిరిగి వస్తాయని వారు చెప్పడంతో మోసపోయానని గ్రహించి 1930కి కాల్ చేసినట్లు పేర్కొన్నాడు. లోన్ పేరుతో మోస పోయాయని బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అత్తపై కొడవలితో దాడి

- భార్యను కాపురానికి పంపడం లేదని అల్లుడి ఘాతుకం
- రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు
- బైక్‌పై పరారవుతుండగా మరో వ్యక్తిని ఢీకొట్టిన వైనం

ఆదిలాబాద్‌టౌన్: తన భార్యను కాపురానికి పంపడం లేదని అల్లుడు అత్తపై కొడవలితో దాడి చేసిన ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన నమ్రతతో మహారాష్ట్రలోని ఝరి తాలుకా లింగి(టి)కి చెందిన పునీత్‌కు 2017లో వివాహం జరిగింది. భార్యపై అనుమానంతో ఆమెను తరచూ వేధించేవాడు. దీంతో ఈనెల 10న నమ్రత పుట్టింటికి వచ్చింది. బుధవారం పునీత్ ఆదిలాబాద్‌కు వచ్చి భార్యను కాపురానికి పంపాలని అత్త రేఖతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో కొడవలితో అత్తపై దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆమె భుజం, వీపు, శరీరంలోని పలు భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. దాడి అనంతరం ద్విచక్ర వాహనంపై పునీత్ పరారవుతుండగా ఎదురుగా వస్తున్న తమ్ముడి రాకేశ్ బైక్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో ఇరువురికి గాయాలవగా రిమ్స్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

మహిళ అదృశ్యం

ఇంద్రవెల్లి: మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలోని కైలాస్‌నగర్‌లో జరిగింది. ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హర్కపూర్ అంద్‌గూడ గ్రామపంచాయతీ పరిధి కైలాస్‌నగర్ గ్రామానికి చెందిన ఓ మహిళ తన భర్త సురేశ్‌తో కలిసి మంగళవారం ఇంద్రవెల్లి మండల కేంద్రానికి వచ్చింది. బ్లౌజ్ మెటీరియల్ కొనుక్కుంటానని భర్తను ఒక దగ్గర ఉండమని చెప్పి వెళ్లింది. కానీ మహిళ తిరిగి రాలేదు. భర్త ఎంత వెతికినా ఆచుకీ దొరకలేదు. దీంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

‘ఉద్యోగరీత్యా వేధిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి’

జన్నారం: అటవీ డివిజన్ కార్యాలయంలో పని చేస్తున్న ఒక ఉద్యోగి ఉద్యోగరీత్యా వేధిస్తూ, తనకు వేతనం రాకుండా ఇబ్బంది పెడుతున్నాడని జన్నారం అటవి డివిజన్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ సవిత ఆరోపించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల తాను బదిలీపై డివిజన్ కార్యాలయానికి రాగా, ఇక్కడ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న షమీమోద్దీన్ సూపరింటెండెంట్ పోస్టుకు అడ్డంకిగా ఉంటానని ఉద్యోగరీత్యా వేధింపులకు గురిచేస్తున్నాడన్నారు. తనను ములుగు ఫారెస్ట్ కళాశాలకు డిప్యూటేషన్‌పై పంపగా, తాను అక్కడికి వెళ్లి డిప్యూటేషన్‌ను రద్దు చేసుకున్నానని డివిజన్ కార్యాలయంలోనే పని చేస్తున్నానని తెలిపారు. అయితే తాను ఇక్కడ పని చేయడం లేదని ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు ఇచ్చి జీతం రాకుండా ఆపినట్లు ఆమె ఆరోపించారు. ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్న షమీమోద్దీన్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకొని, తనకు జీతం వచ్చేలా చేయాలని ఎఫ్‌డీపీటీ, జిల్లా అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సవిత తెలిపారు. ఈ విషయంపై జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆషిస్ సింగ్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా శాఖాపరంగా విచారణ జరిపి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

దాడిలో గాయపడిన వారి పరిస్థితిపై చర్చ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లోని ప్రముఖ రియల్టర్ జగన్‌మోహన్‌రావు ఇంటి వద్ద ఈ నెల 23న అర్ధరాత్రి రెండు వర్గాల మధ్య జరిగిన దాడిలో గాయపడిన వారి పరిస్థితిపై జిల్లా కేంద్రంలో తీవ్రంగా చర్చ జరుగుతోంది. జగన్‌మోహన్‌రావు వద్ద పనిచేసే మేర సంజీవ్‌పై పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని స్థానిక వాటర్ ట్యాంక్, ఆర్పీ రోడ్ ఏరియాకు చెందిన బండారి రుద్రతేజ, జ్ఞానేశ్వర్‌లతో కలిసి మరి కొందరు దాడికి యత్నించగా ఇరు వర్గాల మధ్య గొడువ జరిగింది. దాడిలో రుద్రతేజ, జ్ఞానేశ్వర్, సంజీవ్‌తో పాటు అక్కడి వాచ్‌మెన్ గాయలపాలయ్యారు. రుద్రతేజకు తలపై తీవ్ర గాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. జ్ఞానేశ్వర్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రుద్రతేజ కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగా సంజీవ్, వాచ్‌మెన్‌ల ఆరోగ్య పరిస్థితి రహస్యంగా ఉంచడం గమనార్హం. కాగా దాడికి సంబంధించిన మరి కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నేడు విలేకరుల సమావేశంలో దాడికి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.

ఎన్నాళ్లకెన్నాళ్లకో..!

- 2008 డీఎస్సీ బాధిత అభ్యర్థులకు ఉద్యోగాలు
- దాదాపు 135 మంది ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు ప్రయోజనం
- 16 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర


నిర్మల్ జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా: ఉమ్మడి రాష్ట్రంలో 2008 డీఎస్సీలో మెరిట్ జాబితాలో ఎంపికైన బాధిత బీఈడీ అభ్యర్థులకు మినిమమ్ టైంస్కేలుతో ఉపాధ్యాయ ఉద్యోగాలను కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులివ్వడంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మెరిట్ జాబితాలో ఎంపికైన బీఈడీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని గత మార్చిలోనే రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. ఈ అంశంపై పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన నివేదికపై ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 135 మంది వరకు బాధిత అభ్యర్థులు ఉండగా అందులో కొంతమంది ఇతర ఉద్యోగాలలో స్థిరపడినా మిగతా వారికి ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం వీరికి కాంట్రాక్టు పద్ధతిలో ఎస్‌జీటీ బేసిక్ వేతనం రూ.31,040 అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. కాగా ఉమ్మడి జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఈనెల 27వ తేదీ నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో వెరిఫికేషన్ ఫారం అందుబాటులో ఉంచినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇదీ నేపథ్యం..

2008లో రాష్ట్ర ప్రభుత్వం 35 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించింది. ఎస్జీటీ పోస్టులను కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేస్తామని, బీఈడీ, డీఈడీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నది. ఆ తర్వాత ఎస్జీటీ పోస్టుల్లో 30శాతం డీఈడీ అభ్యర్థులకు కేటాయిస్తూ జీవో-28ని తీసుకొచ్చింది. దీంతో బీఈడీ అభ్యర్థులు కోర్టుకు వెళ్లగా కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో నోటిఫికేషన్ ప్రకారమే ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రభుత్వం జీవో 27ను విడుదల చేసింది. డీఈడీ అభ్యర్థులు పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా జీవో 28 ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించింది. ఆ తర్వాత 30 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కొత్త మెరిట్ జాబితా విడుదల చేసి 2010లో ఉద్యోగాలు ఇచ్చారు. దీంతో మెరిట్ సాధించినా ఉద్యోగం రాక ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు 3,500 మంది బీఈడీ అభ్యర్థుల కలలు కల్లలయ్యాయి. ఇందులో తెలంగాణ అభ్యర్థులు దాదాపు1,300 మంది వరకు ఉండగా ఉమ్మడి జిల్లాలో దాదాపు వందకుపైగా అభ్యర్థులు ఉన్నారు.

ఇప్పటికైనా ఇవ్వడం సంతోషం



2008లో వెలువడిన డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా మెరిట్‌లో ఎంపికైనా కౌన్సెలింగ్ సమయంలో ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల వల్ల బీఈడీ అభ్యర్థులం నష్టపోయాం. అప్పటి నుంచి సుప్రీం, హైకోర్టుల చుట్టూ ఎన్నోసార్లు తిరిగాం. మాకు అనుకూలంగా తీర్పులు వచ్చాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం హర్షణీయం.

– సుద్దాల రాజేశ్వర్, కడెం

రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగాలివ్వాలి



హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు మాకు అనుకూలంగా ఉన్నా గత రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేసింది. ఇప్పటికైనా మమ్మల్ని గుర్తించి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడం సంతోషం. చాలా సర్వీసు కోల్పోయాం. మినిమం టైం స్కేల్‌తో కాకుండా శాశ్వత ప్రాతిపదికన నియామక పత్రాలు అందించాలి.

– గంగాధర్, బీరవెల్లి, మం.సారంగాపూర్

ఆత్మహత్య చేసుకున్న యువకుడి గుర్తింపు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఈ నెల 24న గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న యువకుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. కుటుంబ సభ్యులు, జీఆర్‌పీ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రికి చెందిన బండి శ్రీనివాస్ –రజితల కుమారుడు సాయితేజ(20)ను బాగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన సాయితేజ ఈ నెల 24 ఇంట్లో నుంచి వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని జీఆర్‌పీ ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సోయంగూడ గ్రామంలోని వెలిగి తండాకు చెందిన ఆత్రం జ్యోతీరావు (41), కోవా శేకు(38)లు మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా కంకర లోడ్‌తో వస్తున్న లారీని సబ్‌స్టేషన్ సమీపంలో ఎదురుగా ఢీ కొట్టారు. ప్రమాదంలో ఆత్రం జ్యోతీరావు అక్కడికక్కడే మృత్యువాత పడగా, కోవా శేకు పరిస్థితి విషమంగా ఉండటంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్‌లు సందర్శించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒకరు..

బోథ్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన కొట్నాక్ కైలాస్ (34) ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగాపూర్ గ్రామానికి చెందిన కైలాస్ ఈ నెల 21న ధన్నూర్ బి గ్రామ శివారులో రోడ్డు పక్కన ఆగి ఉన్న ఎడ్లబండిని బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో ఆయనకు కడుపు భాగంలో, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే బోథ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి కైలాస్ మృతి చెందాడు. భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నలుగురికి ఆరునెలల జైలు

జన్నారం: మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సీ కులానికి చెందిన బొట్ల అన్వేష్ అనే యువకుడిని బెల్టు, కర్రలతో కొట్టి కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించిన నలుగురికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.4 వేలు జరిమానా విధిస్తూ మంచిర్యాల కోర్టు న్యాయమూర్తి శివరాం ప్రసాద్ తీర్పునిచ్చినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తన బంధువును తీసుకెళ్లాడనే కోపంతో అన్వేష్ అనే యువకుడిని పొనకల్‌కు చెందిన హరీశ్‌కుమార్, ముత్యం సాయి, ప్రశాంత్, అజ్మత్‌ఖాన్‌లు కర్రలతో కొట్టి చంపుతామని బెదిరించారు. అన్వేష్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై వినోద్‌కుమార్ కేసు నమోదు చేశారు. మంచిర్యాల కోర్టు లైజన్ అధికారి సయ్యద్ తాజోద్దీన్, సీడీవో అఫ్జేకార్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణరెడ్డిలు 17 మంది సాక్ష్యులను విచారించి నేరం రుజువు చేయడంతో నలుగురికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.4 వేలు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన యువతి మృతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కన్నాపూర్ గ్రామపంచాయతీ పరిధి రాంజీగూడ గ్రామంలో ప్రేమజంట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటనలో గాదిగూడ మండలం బొద్దిగూడ గ్రామానికి చెందిన యువతి పంద్ర దృపతబాయి (19) రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. మృతురాలి తల్లి అనసూయబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. పెద్దలు ప్రేమకు అంగీకరించరని పురుగుల మందు తాగగా ప్రియుడు హన్మంత్‌రావు ఇప్పటికే మృతి చెందిన విషయం తెలిసిందే.

కిందపడి వృద్ధుడికి గాయాలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫాంపై కూర్చున్న గుర్తు తెలియని వృద్ధుడు గద్దెపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జీఆర్‌పీ పోలీసులు 108 అంబులెన్స్ సహాయంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు జీఆర్‌పీ ఎస్సై మహేందర్ తెలిపారు.

ఇంట్లో దొంగతనం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తిర్పెల్లి కాలనీలో గల నీరటివాడలోని ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి యజమాని శ్యామ్, కుటుంబసభ్యులు మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దొంగలు చొరబడ్డారు. బీరువాలోని రూ.1లక్ష నగదుతో పాటు రెండు తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ఉదయం చూసి చోరీ జరిగినట్లు వారు గుర్తించారు. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అప్పులు చెల్లించలేక యువకుడు ఆత్మహత్య



సోలంకి రవి (ఫైల్)

బోథ్: ఫైనాన్స్‌ల వద్ద తీసుకున్న అప్పులు ఎలా తీర్చాలో తెలియక మండల కేంద్రానికి చెందిన సోలంకి రవి(31) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రవి డీజే సిస్టమ్ ఏర్పాటు నిమిత్తం పలు ఫైనాన్స్ కంపెనీల నుంచి రుణం తీసుకున్నాడు. గతేడాది వివిధ ఫైనాన్స్‌ల్లో రూ.2.92 లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక కొంతకాలంగా మనోవేదనకు గురయ్యాడు. కాగా మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం గ్రామ శివారులోని ఓ చేనులో ఉరేసుకుని ఉన్న రవిని గుర్తించారు. మృతుడికి భార్య శ్యామల, ముగ్గురు సంతానం ఉన్నారు. రవి తండ్రి గతంలోనే మృతి చెందగా, సోదరుడు రమేశ్ నెలన్నర క్రితం మృతిచెందాడు. మిగిలిన పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తల్లి జీజాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫైనాన్స్‌ల ఒత్తిడి వల్లే..?

రవి ఆత్మహత్యకు మైక్రోఫైనాన్స్ కంపెనీలే కారణమని తెలుస్తోంది. ఆయా కంపెనీల ఒత్తిడి కారణంగానే కొంత కాలంగా మానసికంగా తీవ్ర ఒత్తిడికి లోనయ్యేవాడని స్థానికులు పేర్కొంటున్నారు. రవి డీజే సిస్టం కొనుగోలు కోసం ఆరు ఫైనాన్స్‌ల వద్ద అప్పు తీసుకున్నాడు. ఈఎంఐ చెల్లించాలని ఆయా కంపెనీల సిబ్బంది తరచూ ఫోన్ చేయడం, పలుమార్లు ఇంటికి రావడంతో మానసికంగా కుంగిపోయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి..


నాగేశ్ (ఫైల్)

తానూరు: మండలంలోని నంద్‌గాం గ్రామానికి చెందిన బొంతేవాడ్ నాగేశ్ (46) కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు నాగేశ్ కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్న వ్యాధి నయం కాకపోవడంతో కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తాగిన మైకంలో బుధవారం వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సంగీత, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రైలు కింద పడి మహిళ..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని భగవంతంవాడకు చెందిన కొండపెల్లి సంగీత(30) అనే మహిళ బుధవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. సంగీత రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుందని, మృతికి గల కారణాలు తెలియరాలేదని జీఆర్‌పీ ఎస్సై మహేందర్ అన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. సంగీతకు భర్త రమేశ్, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


సంగీత మృతదేహం



సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILES
VEHICLE FOR SALE
■ VEHICLES FOR SALE: On Where Conditions Vehicles for Sale JCB 3DX 2WD BHL BSIII - 2017 TS19A3031. Indusind Bank Ltd. Mancherial Branch. Contact No. 7338879680 [K-1246898]

WANTED
■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ, Sal:20k-30k మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 9030612463 [G-9049]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, వార్డ్ బాయ్స్, ఆయాలు, లేడి సూపర్‌వైజర్స్ భార్యభర్తలు కావలెను.Ph: 9391036931, 9246585901 [HA-14711]

■ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీ వసతి + భోజనం. జీతం: 17K. ఫోన్: 8520874499, 8520980099 [H-796282]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,